www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 12 జనవరి 2023

5

అన్నమయ్య



క్రీడల్లో గెలుపోటములు సమానమే

ప్రజాశక్తి-రామాపురం

క్రీడల్లో గెలుపోటములు సమానమేనని మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సరస్వతిపల్లి గ్రామ సర్పంచ్ మునీర్ బాషా సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఈ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆయనకు కమిటీ సభ్యులు, వైసిపి నాయకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక మానసిక దృఢత్వంతో పాటు పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకునే స్వభావం ఏర్పరచుకోగలరన్నారు ఆటల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకొని ముందు సాగాలన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె, మార్కెట్ చైర్మన్ కర్ణపు విశ్వనాథ్‌రెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, వైసిపి రాష్ట్ర యువజన విభాగ జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ మున్నీర్ బాషా, మహబాషా, వైస్ ఎంపీపీ బాబు, రమణ, కదిరిప్ప నాయుడు, దువూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

వీధివ్యాపారులకు భరోసా జగనన్న తోడు : కలెక్టర్



లబ్ధిదారులకు చెక్ అందజేస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

జగనన్నతోడు చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తులవారికి బాసటగా నిలుస్తోందని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. బుధవారం జగనన్నతోడు 6వ విడతలో భాగంగా చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు, జగనన్నతోడు పథకం ద్వారా రుణాలు పొంది, సకాలంలో చెల్లించిన వారికి వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ గిరీష, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, ఎల్‌డిఎం వెంకటేశ్వర్‌రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న తోడు పథకం 6వ విడత జిల్లాలో 11,134 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.పది వేలు చొప్పున రూ.11.13 కోట్లు లబ్ధిదారులకు జమ చేశామని పేర్కొన్నారు. జగనన్న తోడు పథకం కింద రుణాలు పొంది, సకాలంలో చెల్లించిన 19,687 మందికి రూ.47.19 లక్షలు వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద లబ్ధిదారులకు జమ చేశారన్నారు. ప్రభుత్వం చిరు వ్యాపారులకు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. చిరు వ్యాపారులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించి నట్లైతే తిరిగి వడ్డీ లేని రుణాలు పొందవచ్చునన్నారు. వీధి వ్యాపారులకు బాసటగా నిలుస్తున్న జగనన్నతోడు పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిరు వ్యాపారులకు రూ.10 వేలు వడ్డీ లేని రుణాలు ఇవ్వడంతో మహిళల ముఖంలో చిరునవ్వులు కనిపిస్తున్నాయని తెలిపారు. ఈ డబ్బును అనవసరమైన అవసరాలకు ఉపయోగించకుండా తీసుకున్న అవసరాలకు మాత్రమే ఖర్చు చేసి ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కలెక్టర్, మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా మెగా చెక్కును అందజేశారు. అనంతరం పొదుపు సంఘాల మహిళలు తయారుచేసిన తినుబండారాలను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

వణికిస్తున్న ..చలి!



గణనీయంగా తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
వెంటాడుతున్న ఆరోగ్య సమస్యలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాలను చలిపులి వణికిస్తోంది. డిసెంబర్ నుంచి చలి తీవ్రత పెరిగింది. వృద్ధులు, పిల్లలు ఆరోగ్య సమస్యలను ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధుల్లో ఆస్మా, పిల్లల్లో చర్మ, అలర్జీ, జలుబు, శ్వాసకోశ సంబంధిత సమస్యలు వెంటాడుతున్నాయి. ఆస్మా బాధితులకు చలికాలం వచ్చిందంటే ఇన్‌హేలరీస్‌ను పీల్చితేగానీ సక్రమంగా శ్వాస ఆడని పరిస్థితి ఎదురవుతోంది. వృద్ధుల్లో ఊపిరిని బిగబట్టించి కుంగదీస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. అలర్జీ బాధితుల పరిస్థితిని గమనిస్తే ఇన్‌ఫ్లమేషన్ కారణంగా విపరీత సమస్యలను ఎదుర్కొనాల్సివస్తోంది. చలిగాలి వల్ల జబులు, గొంతు వాపు, ఊపిరితిత్తుల్లో నెమ్ము చేయడం వంటి సమస్యలతో ఎడతెగని దగ్గు వంటి సమస్యలు వెంటాడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా పలువురు ఆనారోగ్య పీడితులు వైద్యుల దగ్గరకు పరుగులు తీస్తుండడం కనిపిస్తోంది.



చాపాడు మండలంలోని ఓ గ్రామంలో మంచుతో కప్పిన రహదారి

కనిపించని రహదారులు

పెరుగుతున్న చలి, మంచుదుప్పటి కారణంగా రహదారులు కనిపించడం లేదు. ప్రతి రోజూ ఉదయం ఐదు నుంచి ఏడు గంటల వరకు రహదారులు కనిపించడం లేదు. గువ్వలచెరువు ఘాట్, రాయచోటి, మదనపల్లి, భాకరాపేట, రైల్వేకోడూరు వంటి ప్రాంతాల్లో రహదారులు మంచు వర్షం కురిసిన తరహా వాతావరణం ఏర్పడుతోంది. ఫలితంగా జాతీయ రహదారుల్లో అక్కడక్కడ ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలూ ఉన్నాయి. పగటి వేళల్లోనూ ఫ్యాన్, ఎసిలను వినియోగించడం లేదు. విద్యుత్ వినియోగం సైతం తగ్గుముఖం పట్టింది. రాత్రి వేళల్లో ఫ్యాన్ వినియోగం కారణంగా జలుబు చేయడం వంటి అనారోగ్య పరిస్థితులు ఎదురువుతుండడం తెలిసిందే. ఉదయం 8.30 గంటల సమయంలో చలి వాతావరణం కనిపిస్తోంది. పెరుగుతున్న చలి తీవ్రత కారణంగా క్రీడాకారులు సైతం ముఖానికి మాస్కులు ధరించడం, చలికోట్లు ధరించి క్రీడాంగణాలకు వెళ్లడం కనిపిస్తోంది. ఉదయం బిపి, సుగర్ బాధితులు తప్పనిసరిగా వాకింగ్ నియమానికి ముందూవెనకాడుతున్న వైనం కనిపిస్తోంది. ఫలితంగా పలువురు అనారోగ్య సమస్యల బారిన పడుతుండడం గమనార్హం.

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

జిల్లాల్లో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. పగటి పూట 35 డిగ్రీలు, రాత్రి పూట 23 డిగ్రీలకు పడిపోతున్న సంగతి తెలిసిందే. భూమిలో తేమ శాతం తగ్గే కొద్దీ చలితీవ్రత పెరుగుతోంది. కడప జిల్లాలోని కడప, ఒంటిమిట్ట, అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు, రాయచోటి, చిన్నమండెం, మదనపల్లి ప్రాంతాల్లో చలి తీవ్రత పెరుగుదల కారణంగా ఉష్ణో గ్రతలు అమాంతంగా పడిపోతున్న సంగతి తెలిసిందే. ఏటా డిసెంబర్ నుంచి ఏప్రిల్ వరకు చలితీవ్రత ఉంటుంది. పల్మనరీ పీడితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడం ఆందోళన కలిగిస్తోంది.

పండ్లతోటలతో పరిహాసమే!

శీతాకాలపు పొంగమంచు, చలితీవ్రతల కారణంగా పండ్ల తోటలపై దుష్ప్రభావం పడుతోంది. ముఖ్యంగా మామిడి, మునగ, నువ్వుల, పసుపు వంటి తోటల పూత దశలపై గణనీయమైన ప్రభావం పడే అవకాశం ఉంది. పూత రాలిపోవడం, పురుగు ఆశించడం దిగుబడులపై ప్రభావం చూపడం వంటి సమస్యలతో సతమతం కావడం తెలిసిందే. బుడ్డశనగ, వేరు శనగ వంటి ఆరు తడి పంటలకు కలిసి వచ్చే అవకాశమూ ఉందని చెప్పవచ్చు. ఏదేమైనా కొంచెం ఖేదం...కొంచెం మోదం అని చెప్ప వచ్చునడంలో సందేహం లేదు.

శాస్త్రీయ పద్ధతుల్లో జీవాల పెంపకం

- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

శాస్త్రీయ పద్ధతిలో గొర్రెలు, మేకల పెంపకాన్ని చేపట్టడం వలన అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై తెలిపారు. స్థానిక పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుల కార్యాలయంలో బుధవారం గొర్రెల పెంపకందారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు వాడినట్లయితే పెద్ద జీవాలు మృతి చెందవని తెలిపారు. పిల్లల్లో మరణాలు తగ్గినప్పుడే గొర్రెలపెంపకందారునికి అధిక ఆదాయం వస్తుందన్నారు. రైతు భరోసా కేంద్రాల నుంచి పశు వైద్య సహాయకుల సేవలను వినియోగించుకోవాలని తెలియజేశారు. చిట్టుక వ్యాధి, నోటి పుండ్ల వ్యాధి, గిట్ట కుళ్ళు వ్యాధి, బొబ్బరోగము, యాంత్రాక్స్, పారుడు రోగం, గాలి కుంట్ల వ్యాధి, దొమ్మరగానికి సకాలంలో టీకాలు వేసినట్లయితే పెద్ద జీవాలు గానీ పిల్లలు గానీ చనిపోకుండా కాపాడుకుంటామని పేర్కొన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందులు తాపించాలని సూచించారు. కార్యక్రమంలో కడప జిల్లా పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం అధికారి డాక్టర్ రాజశేఖర్, రాజంపేట డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ ప్రతాప్, సహాయ సంచాలకులు డాక్టర్ కె.డి.వరప్రసాద్, డాక్టర్ సురేష్ రాజు, సహాయ సంచాలకులు, డాక్టర్ శరత్ కుమార్‌రెడ్డి, డాక్టర్ భాగ్యవతి, డాక్టర్ వేదవతి, డాక్టర్ సుదీష్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ రామ సుబ్బారెడ్డి, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ జానకి, రాష్ట్ర గొర్రెల పెంపకందారుల శిక్షణా కేంద్రం, ప్యాపిలి, నంద్యాల జిల్లా అధికారులు పాల్గొని గొర్రెల పెంపకం దారులకి సలహాలు, సూచనలు ఇస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుణశేఖర్ పిళ్లై



బహుమతులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

యువతకు ఆదర్శం స్వామి వివేకానంద

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్వామి వివేకానందుడు యువతకు ఆదర్శమని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజులు తెలియజేశారు. బుధవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వివేకానంద 160వ జయంతిని పురస్కరించుకొని పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వడం మంచి పరిణామమని పేర్కొన్నారు. స్వామి వివేకానంద దేశ ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తిన్నారు. ఆనాడు ప్రపంచం దృష్టిలో భారతదేశాన్ని చిన్నచూపు చూసే క్రమంలో చికాగోలో వారి ప్రసంగం ద్వారా భారత దేశ కీర్తి ప్రతిష్టలు ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింపజేశారని తెలిపారు. ఆయన చెప్పిన సూక్తులు ఎప్పటికీ నిలిచిపోతాయని తెలిపారు. ఆయన అడుగుజాడల్లో నేటి యువతీ, యువకులు నడవాలని, వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజన్ చైర్మన్ షేక్ అబ్దుల్లా, లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు టి.లక్ష్మీనారాయణ, కార్యదర్శి రవికుమార్, మాజీ అధ్యక్షులు ఏ.వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంద అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో వంద అడుగుల శాశ్వత జాతీయ జెండాను ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి ఆవిష్కరించారు. పంచాయతీ సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష ప్రత్యేక శ్రద్ధతో స్థానిక పంచాయతీ కార్యాలయం భవనంపై ఏర్పాటు చేసిన ఈ జెండాను బుధవారం ఎమ్మెల్యే ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ, రాష్ట్రపతి భవన్, రాజ్‌భవన్‌లపై ఏర్పాటు చేసిన శాశ్వత జాతీయ జెండా తరహాలో పీలేరు పంచాయతీ కార్యాలయంలోనూ సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాటు చేశారన్నారు. జెండా రాత్రివేళ్ళలోనూ కనబడే విధంగా విద్యుత్ దీపాలను కూడా సమకూర్చారన్నారు. ఈ జాతీయ జెండా పీలేరు పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పంచాయితీ భవనంపై 52 అడుగుల ఎత్తు స్థంబానికి దీన్ని ఏర్పాటు చేసినప్పటికీ నేల నుంచి ఈ జాతీయ జెండా వంద అడుగుల ఎత్తులో ఉందని పేర్కొన్నారు. ఈ పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, జడ్‌పిటిసి ఏటి రత్నశేఖర్ రెడ్డి, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్‌ఎండి షఫి, మండల వైస్ ఎంపిపి ఎన్‌వి చలపతి, సింగిల్ విండో చైర్మన్ బిడి నారాయణ రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అగా మొహిద్దీన్, సాంస్కృతిక, పర్యాటక శాఖ అన్నమయ్య జిల్లా బోర్డు సభ్యులు షేక్ షాకీర్, మండల కన్వీనర్ దండు జగన్మోహన్ రెడ్డి, ఏఎంసి మాజీ చైర్మెన్ కడప గిరిధర్ రెడ్డి, మైనార్టీ నాయకుడు అబ్దుల్ కలీం, మాజీ ఎంపిపి మహితా ఆనంద్, గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ నాగరాజమ్మ పాల్గొన్నారు.




జెండాను ఆవిష్కరిస్తున్న చింతల

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పీలేరు

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పింఛన్ల పంపిణీ ద్వారా నిస్సహాయుల బతుకులకు భరోసా అందిస్తున్నట్లు పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. పంచాయతీ పరిధిలోని పేదలకు కొత్తగా మంజూరైన 140 పెన్షన్లను బుధవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా కొత్త పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందివ్వడమే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకే కాకుండా దీర్ఘకాలిక ఆనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి కూడా పెన్షన్ అందిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ ఎందరో నిస్సహాయుల జీవితానికి ఆసరాగా ఉందని, మరెన్నో కుటుంబాలకు ఆకలి తీరుస్తోందని, ఇంకెందరో దీర్ఘకాలిక రోగులు మందులు కొనుగోళ్ళకు వినియోగించుకుంటున్నారని చెప్పారు. మండల పరిధిలో 9006 సమాజిక పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండలానికి కొత్తగా 305 పెన్షన్లు మంజేరయ్యాయని, వాటిలో ఒక్క పీలేరు పంచాయతీకే 140 పెన్షన్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహమద్ ఖాన్, స్థానిక పంచాయతీ సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, జడ్‌పిటిసి ఏటి రత్నశేఖర్ రెడ్డి, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్‌ఎండి షఫి, మండల వైస్ ఎంపిపి ఎన్‌వి చలపతి, సింగిల్ విండో చైర్మన్ బిడి నారాయణ రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అగా మొహిద్దీన్, సాంస్కృతిక, పర్యాటక శాఖ అన్నమయ్య జిల్లా బోర్డు సభ్యులు షేక్ షాకీర్, మండల కన్వీనర్ దండు జగన్మోహన్ రెడ్డి, ఏఎంసి మాజీ చైర్మెన్ కడప గిరిధర్ రెడ్డి, మైనార్టీ నాయకుడు అబ్దుల్ కలీం, మాజీ ఎంపిపి మహితా ఆనంద్, గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ నాగరాజమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రశ్నిస్తే ముస్లిం మహిళలపై దాడులా? : టిడిపి

రాయచోటి: గడప గడపకూ ప్రభుత్వ కార్యక్రమంలో స్థానిక సమస్యలు, పెన్షన్లపై ప్రశ్నించినందుకు ఫాతిమా, రమీజాపై కళ్ళల్లో కారం చెల్లి, ఇనుపరాళ్ళతో వైసిపి నాయకులు దాడిచేయడం దారుణమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముస్లిముల ఓట్లతో గద్దెనెక్కి ఇప్పుడు వారిపైనా దాడులకు పాల్పడ్డం సిగ్గుచేటన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన దగ్గర నుండి మైనార్టీల పక్షపాతి ప్రభుత్వం అని చెప్పుకుంటూనే ముస్లిం మైనారిటీలపై దాడులు దౌర్జన్యాలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడకి చెందిన ఒంటరి ముస్లిం మహిళలు అయిన ఫాతిమా, రమీజా, పెన్షన్ కోసం అని దేవినేని అవినాష్‌ను ప్రశ్నిస్తే మరుసటి రోజు ఉదయం 25 మంది వైసిపి గుండాలు మహిళల ఇంట్లో దూరి దాడులకు. పాల్పడడం అత్యంత దారుణమైన విషయం అన్నారు. అధికార పార్టీ నాయకుల తీరు వారి రాజకీయ సమాధి కొద్ది దూరంలోనే ఉందన్నారు. ముస్లిం మైనార్టీ ఆత్మగౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని కించపరిచిన దేవినేని అవినాష్, స్థానిక కార్పొరేట్ రామిరెడ్డి బేషరతుగా ఫాతిమా, రమీజాలకు మాత్రమే కాదు యావత్తు మహిళ లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బాధితులు ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్తే కృష్ణలంక సిఐ దుర్గారావు దుర్భాషలాడడం దారుణమన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన : మాజీ ఎమ్మెల్యే

రామాపురం: రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవినీతి, అరాచక, నియంతృత్వ, అక్రమ పాలనను సాగిస్తోందని, త్వరలో గద్దె దింపుతామని రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నీలకంఠ రావుపేటలో ముస్లిం మైనార్టీ సోదరుల ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వం కొనసాగిస్తున్న అరాచకాల గురించి ప్రజలకు వివరించారు. టిడిపి హయాంలో ముస్లిం మైనార్టీలకు అందేటటువంటి దుల్హన్ పథకం, రంజాన్ తోఫా, తదితర పథకాలను లేకుండా చేశారని ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళల పరిస్థితి మరింత దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినిత్యం సామాన్యుల జీవితాలతో చెలగాట మాడుతున్న వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించాలంటే ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టిడిపికి అండగా నిలిచేందుకు ప్రజలంతా సైనికుల్లా ముందుకు కదలాలని పిలుపునిచ్చారు.

పది మైనార్టీ కుటుంబాలు టిడిపిలో చేరిక

ఆర్ రమేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నీలకంఠరావుపేట గ్రామానికి చెందిన పది ముస్లిము కుటుంబాలు 1 బుధవారం చేరాయి. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రమేష్ రెడ్డి, టిడిపి మండల మైనార్టీ నాయకుడు మహబూబ్ బాషా, గడి కోట భాస్కర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, రవి శంకర్ రెడ్డి, తెలుగు యువత ఉపాధ్యక్షులు దివ్య కుమార్ రెడ్డి, నాగభూషన్ రెడ్డి, చెన్నూరు బాబు నజీర్, నియాజ్. సయ్యద్ ఫిర్, సాదక్, నరేంద్ర కుమార్ రెడ్డి. ఇసాక్, బాషవల్లి, సలామ్, జాబిల ,అసఫక్ ,ఈర్షద్, క్రిష్ణాయ్య., పెంచల్ రెడ్డి, రామక్రిష్ణ గౌడ్, వెంకట్రామిరెడ్డి వెంకటశివయ్య వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కేశప్ప

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని మదనపల్లె డిఎస్‌పి కేశప్ప హెచ్చరించారు. బుధవారం స్థానిక ఒన్ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 17 ఏళ్ల లోపు పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని, ఎక్కడైనా వారికి రోడ్డు ప్రమాదం జరిగితే ప్రమాదానికి కారణమైన యువకులతో పాటు వాహనం యజమాని పైన కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలను ఇవ్వొద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేనిదే వాహనాల నడపరాదని స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగ వస్తున్న నేపథ్యంలో ఎవరైనా పండుగలకు ఊళ్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సంక్రాంతి నేపథ్యంలో ఊర్లకు వెళ్లే వాళ్లు తప్పనిసరిగా ఇళ్లకు తాళాలు వేసి పోలీసులకు సమాచారం చేరవేస్తే చోరీలు జరగకుండా రాత్రివేళ గస్తీ నిర్వహిస్తారని చెప్పారు. లాక్డ్ హౌస్ మేనేజ్మెంట్ సిస్టంతో నిఘా ఉంటుందన్నారు. పోలీసులకు సహకరిస్తే నేరాలు నియంత్రణ కు క ృషి చేస్తామని తెలిపారు. ఊర్లకు వెళ్లే ముందు రోజు వారి పరిధిలోని పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఒన్ టౌన్ ఇన్‌ఛార్జి సిఐ సాదిక్ అలీ, రూరల్ సిఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం : జడ్జి

ప్రజాశక్తి-రాయచోటి

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ డాక్టర్ కె.శారద అన్నారు. బుధవారం రాయచోటి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌ఎన్ కాలనీలోని శ్రీ సాయి బాబా మందిరం ఆవరణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్వకాలం నుంచి వస్తున్న సంక్రాంతి సంప్రదాయలను ప్రజలలో చైతన్యాన్ని పెంపొందించేలా లయన్స్ క్లబ్ వారు ముందుకు తీసుకెళ్తూ తెలుగు జాతి ఐక్యతను తెలియజేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. దాతలు బి.నాగిరెడ్డి, వి.సుబ్బారెడ్డి, బి.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి లయన్స్ క్లబ్ తరుపున నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి నగదు బహుమతులుగా ఇవ్వడం చాల సంతోషంగా ఉంది రాబోయే రోజులలో మరిన్ని సేవా కార్యక్రమలు చేయడానికి మా వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.బయరెడ్డి, డాక్టర్ సంగమ్మ, శోభ రెడ్డి, రామాదేవి, వ్యవస్థాపక అధ్యక్షులు హరినాధరెడ్డి, ఉపాధ్యక్షులు హరీష్ చంద్ర, కోశాధికారి రత్నమాచారి, ఆనంద్. నందిని ట్రావెల్స్ వినోద్ కుమార్ నాయక్, లోకేష్ స్వామి, సుభాష్ చంద్ర బోస్ పాల్గొన్నారు.



గెలుపొందిన వారికి నగదు అందజేస్తున్న జడ్జి శారద

పండగ పూట జరభద్రం

- సంక్రాంతికి ఊరు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి
- దొంగతనాలపై పోలీసుల నిఘా అవసరం

ప్రజాశక్తి వీరబల్లి

సంక్రాంతి పండగ వచ్చిదంటే పట్టణాలు, నగరాల్లో ఉండే వారందూ తమ సొంతూళ్లకు చేరుకుంటారు. ఈ సమయాల్లోనే దొంగతనాలు అధికంగా జరుగుతుంటాయి. ఇంటికి తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా పెట్టుకున్నారు. దొంగలు, ఇంట్లోకి చొరబడి నగలు, నగదు, అపహరించుకు పోతుంటారు. పలుచోట్ల సీసీ కెమెరాలు, వీధుల్లో పోలీసుల నిఘా ఉన్నప్పటికీ దొంగతనాలకు అడ్డుకట్ట పడడం లేదు. ఇప్పటికే కొన్ని పాఠశాలలకు సెలవులు ఇచ్చారు. వారం రోజులు పాటు సెలవులే. పిల్లలను చదివించుకోవడానికి పట్టణాల్లో నివాసం ఉండేవారు సంక్రాంతికి ఊరికి వెళ్లి పాఠశాలలు తెరిచే నాటికి తిరిగి వస్తుంటారు.ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లాల్సి వస్తే విలువైన నగదు, నగలు వెంట తీసుకుపోవాలి. లేకుంటే బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలి. ఊరు వెళుతున్న విషయం పొరుగువారికి చెప్పి తమ ఇంటిపై ఓ కన్నేసి ఉంచమని చెప్పాలి. వీలైతే సీసీ కెమెరాలు పెట్టుకోవాలి. సెల్ ఫోన్‌కు అనుసంధానించుకుని తరచూ పరిశీలిస్తూ ఉండాలి. సంక్రాంతి సమయంలో రద్దీ ఎక్కువగా ఉంటుంది . ఇదే అదునుగా బ్యాగుల్లోని నగదు నగలు కాజేస్తుంటారు. ఆటోలోనూ దొంగలు ప్రయాణిస్తూ జేబులు కొట్టేస్తుంటారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జూదం, కోడి పందేలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని వీరబల్లి ఎస్ఐ ఎస్.కె రహీముల్లా హెచ్చరించారు. జూదం, కోడి పందేలు, అక్రమ మద్య విక్రయాలు, మద్యం అక్రమ రవాణా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పైన కఠినంగా వ్యవహరించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

వీధుల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తూ ఉంటే ఆరా తీయాలి. అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బస్సులు, ఆటోలలో ప్రయాణించే సమయంలో జాగ్రత్తగా ఉంవాలి. దొంగతనం జరిగితే వెంటనే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలి.

-ఎస్.కె రహీముల్లా, ఎస్ఐ


భూమిపూజ చేస్తున్న ఎంపిపి జల్లా సుదర్శన్ రెడ్డి

తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకండి : ఎంపిపి

ప్రజాశక్తి-గాలివీడు

తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకండని మండల ఎంపిపి జల్లా సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక బాలికలు ఉన్నత పాఠశాల ఆవరణంలో నాడునేడు కింద బాలికల జూనియర్ కళాశాలకు 11వ గదులకు కోటి 20 లక్షలు నిధులతో భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై ఎంత నమ్మకంతో తల్లిదండ్రులు పాఠశాల పంపిస్తున్నారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతివిద్యార్థి మంచి ఉన్నతమైన లక్ష్యంతో ముందు సాగాలని సూచించారు. పదో తరగతి విద్యార్థినిలు వందశాతం ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఓ.నిర్మల పాఠశాల స్కూల్‌కమిటీ చైర్మన్ కుందా లక్ష్మీప్రసన్న ఉపాధ్యాయులు వసుంధర, పద్మావతి, చంద్రావతి, చలపతి, కార్యకర్తలు రమణారెడ్డి, ధనుంజయరెడ్డి, వెంకట్ రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలకు వేలం

ప్రజాశక్తి-కలకడ

నాటుసారా తరలిస్తూ పట్టుబడిన రెండుద్విచక్ర వాహనాలను వేలం వేసినట్లు కలకడ సిఐ నాగేంద్ర తెలిపారు. మండల కేంద్రమైన కలకడ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం టివిఎస్ స్కూటీ, బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనాలను వేలం వేశారు. టివిఎస్ స్కూటీ వేలంపాట ద్వారా వెంకట రమణ ఎనిమిది వేల రూపాయలకు తన సొంతం చేసుకున్నాడు. అదేవిధంగా బజాజ్‌పల్సర్‌ను కలకడకు చెందిన సయ్యద్‌భాష 36వేల రూపాయలు వేలంపాట పాడి దక్కించుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌కు 44 వేల రూపాయలు ఆదాయం వచ్చినట్లు సిఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ తిప్పేస్వామి, హెడ్ కానిస్టేబుళ్లనాగరాజా, సునీల్ శశికుమార్, రెడ్డిబాబు, శ్రీనివాసులు ,మహబూబ్ బాషా, సుబ్బయ్య ,ఖలీల్ పాల్గొన్నారు.


చేతిబోరు వద్ద నీటి కోసం ఎదురు చూస్తున్న మహిళలు

అనంతంపల్లెలో తాగునీటికి ఇక్కట్లు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతంపల్లె గ్రామపంచాయతీలో మోటారు పనిచేయక మంచినీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గత నాలుగు రోజులు నుంచి మోటారు పనిచేయకపోవడంతో గ్రామంలో ఉన్న చేతిపంపు ద్వారా నీటిని మోసుకుంటూ ఇక్కట్లు పడుతున్నారు. పంచాయతీలో ఎవరు పట్టించుకోకపోవడంతో మంచి నీటి కోసం చేతి పంపు దగ్గర ప్రజలు వరుస కడుతున్నారు. చేతి పంపు ద్వారా నీరు ఆలస్యం కావడం చేత రేయింబవళ్ళు ప్రజలు పంపు దగ్గరే పడిగాపులు కాస్తున్నారు. బోరు పునరుద్ధరించి తమను మంచి నీటి కష్టాల నుంచి గట్టెక్కించాలని ప్రజలు కోరుతున్నారు.ఇంతకు మునుపు మూడుసార్లు పంచాయతీ సెక్రటరీ శివశంకర్ తన సొంత ఖర్చు 35 వేల రూపాయలు పెట్టి మూడుసార్లు పంచాయతీ మంచినీటి బోరుని తయారు చేపించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మారుమూల ప్రాంతాలకు కూడా మంచినీటి వసతి కల్పిస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఈ గ్రామంలో అటువంటి పరిస్థితి కానరావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పండగ సమయంలో మంచినీటి కోసం అవస్థలు పడుతున్నామని గ్రామప్రజలు ఆవేదనవ్యక్తం చేశారు.ఈ విషయంపై ఎంపిడిఒను ప్రకాశంను వివరణ కోరగా సమస్యను త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.

ఉపకరణాలతో జీవన నైపుణ్యాలు మెరుగు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరి ధిలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులకు ఎంపిపి టి.లక్షుమయ్య బుధవారం వీల్ చైర్లు, సహాయ పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం విభిన్నప్రతి భావం తుల సమస్యల పట్ల అన్ని రకాలుగా సహకరిస్తుందన్నారు. వారికి అవసరమైన ఉపకరణాలను అందిస్తుందన్నారు. తద్వారా విభిన్న ప్రతిభా వంతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జీవన నైపుణ్యాలు వారు మెరుగు పరుచు కునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అయిదు వీల్‌ఛైర్లు, సిపి ఛైర్, ఒక జత చంకకర్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, ఎంఇఒ రవిశంకర్, ఎంఆర్‌సి సిబ్బంది, ఐఇఆర్‌పి లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు ప్రజల సౌకర్యార్థం మరో రెండు అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనమాట్లాడుతూ రూ.163కోట్లతో కాలువల ఆధునీకరణ, రూ.119కోట్లతో మంచినీటి పైప్‌లైన్, కుళాయి కనెక్షన్లు, నాలుగు వాటర్ ట్యాంకుల నిర్మాణం, ఆధునీకరణ పనులను త్వరలో ప్రారంభినున్నట్లు తెలి పారు. రూ.163కోట్లతో 70కి.మీ.ల మేర ఇంటర్నల్ కాలువలు నిర్మిస్తా మన్నారు. 5.26కి.మీ.ల పనులు ప్రధానంగా కొత్తపల్లి నుండి సినీహబ్ వరకు మడూరు నుండి కొత్తపల్లి వరకు ఎక్స్‌టెన్షన్ పనులతో పాటు కొత్తపల్లిలో ఐదు ఎకరాల స్థలంలో మురికినీటి శుద్ధి కర్మాగారం కూడా నూతనంగా ఏర్పాటు చేస్తామన్నారు. వీటితో మురుగునీటిని పంట పొలాలకు విని యోగించేలా శుద్ధి చేయనున్నట్లు తెలిపారు. రూ.119 కోట్లతో 20వేల 500 కొత్త కొళాయి కనెక్షన్‌లు ఇస్తూ 2024 జనవరిలోగా పనులు పూర్తి చేస్తామ న్నారు. ప్రజలకు శాశ్వితంగా మంచినీటి సమస్యను తీరుస్తామని రాచమల్లు తెలిపారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లె

గ్రామసచివాలయాల ద్వారా ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయని ఎమ్మెల్యే గడికొట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోనంపేట గ్రామంలో కొత్తవడ్డేపల్లె, సి వడ్డెపల్లె, కొండావాండ్లపల్లె, కొనసాని వాండ్లపల్లె, ఎర్రప్పగారిపల్లె, కాలాడి వాండ్లపల్లె లలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజా సమస్యలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా సిఎం జగన్ పాలన అందిస్తున్నారన్నారు. విప్లవాత్మక మార్పులుతో, వ్యవస్థలలో మార్పులు తెచ్చి ప్రజల వద్దకే పాలనను తెచ్చారన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపిపి అంబాబత్తిన రెడ్డయ్య, మార్కెట్ యార్డ్‌చైర్మన్ కర్ణపువిశ్వనాథరెడ్డి, ఉపమండల అధ్యక్షుడు సమరసింహారెడ్డి, తాహశీల్దార్ నాగప్రసన్నలక్ష్మి, ఎంపిడిఒ వెంకటరమణారెడ్డి, ఎపిఎస్‌పిడిసి ఎల్ ఎఇ కిషోర్, మాజీ సర్పంచ్ కొండప్రసాద్‌రెడ్డి, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.


గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి


కన్యకా చెరువు కట్ట పరిశీలను వెళుతున్న ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి

కన్యకాచెరువు కాలువల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు లోని కన్యకా చెరువు తోపాటు కాలువల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన వైసిపి నాయకులతో కలిసి కన్యకాచెరువు కాలువలను పరిశీలించారు. చెరువు సమీపంలోని కట్టపై అనేకమంది పేదల జీవిస్తున్నారని సమీపంలోని ఖాళీ ప్రదేశంలో నందలూరుకు చెందిన మత్స్యకారులకు వారి అభివృద్ధి కోసం చెరువులో పట్టిన చేపలను శుభ్రం చేసుకునేందుకు తాత్కాలిక షెడ్డును ఏర్పాటు చేసుకునేందుకు అధికారులతో మాట్లాడి అనుమతులు ఇప్పించడం జరిగిందన్నారు. చాలాకాలంగా వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యల పరిష్కారం దిశగా ముందుకు వెళ్తామన్నారు. ప్రధాన కాలువ ఆక్రమణకు గురైందని దీంతో చెయ్యేరునది నుండి నీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ప్రస్తుతం చెరువు అభివృద్ధికోసం ఐదులక్షల రూపాయలు మంజూరు అయ్యిందని ఆనిధులతో ప్రధానకాలవను అభివృద్ధి పరచడం జరుగుతుందన్నారు. మాది పేదల ప్రభుత్వమని పేదలకు ఎప్పుడు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మేజర్‌గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, కో-ఆప్షన్ సభ్యులు కలిమ్, గ్రామకార్యదర్శి ప్రసాద్, వైసిపినాయకులు ముమ్మడి మదన్ మోహన్ రెడ్డి, పెనుబాల నాగసుబ్బయ్య, హిమగిరి పాల్గొన్నారు.

ఘనంగా వడ్డేఓబన్న 216వ జయంతి

ప్రజాశక్తి-రాయచోటి

స్థానిక వడ్డే ఓబన్న సర్కిల్‌లో వడ్డే ఓబన్న 216 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి వడ్డెర విద్యా వంతుల రాష్ట్ర కన్వీనర్ కె.జీవానందం , సర్పంచ్ పి.వాసు పూలమాల లువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ముఖ్య అనుచరుడైన వడ్డే ఓబన్న బ్రిటిష్ సామ్రాజ్యవాదులు విధించే శిస్తులకు వ్యతిరేకంగా గెరిల్లా పోరాటంచేసి తెల్ల దొరలను ముప్పు తిప్పలు పెట్టాడని, చివరిశ్వాసవరకు బ్రిటిష్ ప్రభు త్వంతో పోరాడి యుద్ధవీరునిగా, భరతమాత ముద్దుబిడ్డగా, దేశ చరిత్రలో వేగుచుక్కలా నిలిచి పోయాడని అన్నారు.ఇంతటి యోధుడు వడ్డెర జాతిలో పుట్టడం వడ్డెరజాతికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఎపిబిసి అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి.నాగముని, అడ్వకేట్, ఎ.పివడ్డెరసాధికారసమితి మెంబర్ పి.నాగార్జున, పాల్గొన్నారు.

రైల్వే సమస్యలపై డిఆర్‌ఎంకు వినతి

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

రైల్వేకోడూరు, రాజంపేట రైల్వేస్టేషన్లో హరిప్రియ ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్ కల్పించాలని చెన్నై ముంబై ఎంజిఆర్ ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్ కల్పిం చాలని డియుసిసి మెంబర్ తల్లం భరత్‌కుమార్‌రెడ్డి గుంతకల్లు డిఆర్ ఎంకు వెంకటరమణారెడ్డిని కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబులవారిపల్లె, రైల్వే కోడూరు అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. కాలేజీ విద్యార్థులు వృద్ధులు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అండర్ బ్రిడ్జిని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఓబులవారిపల్లె, పుల్లంపేట రైల్వేస్టేషన్‌లో తిరుమల ఎక్స్‌ప్రెస్, గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు స్టాపింగ్ కల్పించాలని కోరారు. రైల్వేకోడూరులో రైతులు పండించిన పంటలు అరటి తమల పాకు రవాణా చేసు కునేందుకు పార్సిల్ కార్యాలయం ఏర్పాటు చేయాలని తిరుపతి నుండి కొత్తరైళ్లను ఓబులవారిపల్లె మీదుగా నెల్లూరు, విజయవాడకు నడిపించాలని కోరారు. సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-కలకడ

సంక్రాంతి వేడుకలను ముందస్తుగా నిర్వహించారు. మండల కేంద్రమైన కలకడ శ్రీచైతన్య పాఠశాలలో ఘనంగా ముందస్తుగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు.పాఠశాల ఆవ రణంలో ప్రత్యేకంగా అలంకరించిన గొబ్బెమ్మను ఏర్పాటు చేసి రంగురంగుల ముగ్గులు వేసి, విద్యార్థులచే సంక్రాంతి పండుగ వేడు కలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సెలవులు సందర్భంగా పాఠశాలకు సెలవులు ప్రకటించనున్న తరుణంలో బుధవారం అంగ రంగ వైభవంగా ముందస్తుగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగరాజు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి :** కలికిరి సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ సుధానందరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల ఆవరణంలో భోగి మంటలు, సంక్రాంతి సంబరాలను స్కూల్ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించి వైభవంగా జరుపు కున్నా రు. కార్యక్రమంలోపాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యా యులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. **గాలివీడు** : జిల్లాపరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబ రాలు ఘనంగా నిర్వహించారు. మండలపరషత్ అభివృద్ధి అధికారి శేఖర్‌నాయక్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజయ్యారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయులు రెడ్డెన్న అధ్యక్షత వహించగా, మహిళా ఉపాధ్యాయినులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. 10వ తరగతి విద్యా ర్థులు ఉట్టికొట్టుడు పోటీ నిర్వహించారు. **నందలూరు:** సిటిజన్స్ సంక్రాంతి సంబరాలు 2023లో భాగంగా దంపతులకు ఉట్టి కార్యక్రమం, కళాకా రులు, కళాభి మానులను కట్టి పడేసింది. భర్త కళ్ళకు గంతలు కట్టితే, భార్య డైరెక్షన్లో భర్త వెళ్లి ఆఉట్టిని కొట్టిన వారికే బహుమతి. ఇది ఎంతో ఆకట్టుకుంది. ఈ ఆటకు జడ్పిటిసి గడికోట ఉషారాణి, గడికోట వెంకట సుబ్బారెడ్డి దంప తులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో రాజంపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గొబ్బిళ్ళ త్రినాథ్, పోతురాజు మస్తా నయ్య, ఆర్ముగం విశ్వనాథ్, మహేష్, మోడపోతుల రాము, విజయుడు పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో బుధవారం ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహరెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగాజరిగాయి. ఉపాధ్యాయులు,విద్యార్థులు భోగిమంటలు వేసి సందడి చేశారు. విద్యార్థులు వేసిన కోలాటం, చెక్కభజన, సాంప్రదాయ నృత్యాలు పలువురిని ఆకర్షించాయి. కార్యక్రమంలో ఎం ఆర్ ఓ మహేశ్వరి బాయి, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** మండలంలోని విస్డమ్ విద్యాసంస్థలలో కరెస్పాండెంట్ డాక్టర్ టి.ప్రదీప్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ టి.మదన్మోహన్, ప్రిన్సిపల్ ప్రియాంక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పుల్లంపేట:** పుల్లంపేట మండలంలోని అనంతం పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉ ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, పాఠశాల కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటరమణ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు ,విద్యార్థులు అందరూ సంప్రదాయ వస్త్రధారణలో అలరించారు. భోగి మంటలు వేసి అందంగా నృత్యాలు చేశారు. **బి.కొత్తకోట :** స్థానిక బి.కొత్తకోట రంగసముద్రం రోడ్డులో ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాలలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో 40 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.కార్యక్రమంలో సంతూర్ సోప్ సేల్స్‌ఆఫీసర్ మంజునాథ్, డిస్ట్రిబ్యూటర్ రఘునాథ్,రిటైర్డ్ హెచ్.ఎంరామచంద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.


గాలివీడు : భోగిమంటల వద్ద కోలాటం ఆడుతున్న విద్యార్థులు

ఫిబ్రవరి 11న లోక్ అదాలత్

- జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కక్షిదారులు ఫిబ్రవరి 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. స్థానిక కోర్టులో బుధ వారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి కేసులు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న కక్షిదారులకు ఇది మంచి అవ కాశం అన్నారు. పగలు, ప్రతీకారాలు మాని, ప్రేమతో మెలిగే అవకాశం జాతీయ లోక్ అదాలత్ ద్వారా సాధ్యమవుతుందన్నారు. క్షణికావేశంలో జరిగిన ఘర్షణ వల్ల జీవితాలు పోగొట్టుకోవాల్సి వస్తుందని వివరించారు. మనసు మార్చుకొని రాజీమార్గంతో రాజమార్గంలో పరిష్కరించుకునే గొప్ప అవకాశం జాతీయ లోక్ అదాలత్ అని తెలిపారు. కోర్టు పరిధిలో ఉన్న న్యాయవాదులు, పోలీస్ అధికారులు, బ్యాంక్ అధికారులు బాధితులకు అవగాహన కల్పించాల న్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఆయన కో రారు.

మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని సచివాలయ సిబ్బంది వార్డ్ కౌన్సిలర్ల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ సూచించారు. పట్టణంలోని రాణివనం, వినాయక నగర్, క్రాంతి నగర్‌కు సంబంధించిన సచి వాలయాల్లో బుధవారం వార్డు కౌన్సిలర్లకు, సచివాలయ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది వార్డు కౌన్సిలర్ల సూచనలను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఆ మేరకు వార్డు కౌన్సిలర్లు సచివాలయ సిబ్బంది కలిసికట్టుగా పనిచేసి అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తుంగ వెంకటరామిరెడ్డి, అలీ, భాస్కర్, చంద్రకళ, కల్లూరు సునీత, ప్రశాంత్, మున్సిపల్ మేనేజర్ పుల్లయ్య పాల్గొన్నారు.

కాయతొలుచు పురుగు నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

కంది పంటలో కాయ తొలుచు పురుగు నివారణకు జాగ్రత్తలు పాటించి, చర్యలు తీసు కోవాలని వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి సూచిం చారు. మం డలంలోని బొందల కుంట గ్రామంలో రబీలో సాగు చేసిన జొన్న, ఉలవ, కంది పంటలను బుధవారం ఎఒ పరిశీలించి, పంట నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంది పంటలో కాయతొలుచు పురుగు నివారణకు ఎకరానికి కొరాజిన్ 30 ఎమ్ఎల్ మందు 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. రైతులు రబీలో సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు కాకపోతే ప్రభుత్వం నుంచి వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే ఏ పథకం వర్తించదన్నారు. ఇకెవైసి చేసుకొనకపోతే పీఎం కిసాన్ పథకం వర్తించదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుదీర్, రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు

వేంపల్లె : వేంపల్లె గ్రామంలోని ఆయా ప్రాంతాల్లో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలాల్లో రెవెన్యూ అధికారులు బోర్డులను ఏర్పాటు చేశారు. గండి రోడ్డులోని పిల్ల స్వామి గుట్ట వద్ద భూ ఆక్రమణలకు ప్రభుత్వ భూమి గురైందని పత్రికల్లో రావడంతో బుధ వారం ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా ఇది ప్రభుత్వ భూమి అని తహాశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి బోర్డులను ఏర్పాటు చేశారు.


క్రికెట్ ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న చమర్తి జగన్మోహన్ రాజు

క్రీడలతో స్నేహభావం : 'చమర్తి'

ప్రజాశక్తి-నందలూరు

క్రీడలతో గ్రామాలు, మండలాలు, ప్రాంతాల క్రీడాకారుల్లో స్నేహభావం పెంపొందుతుందని రాజంపేట నియోజకవర్గ సీనియర్ టిడిపి నాయకులు చమర్తి జగన్మోహన్ రాజు పేర్కొన్నారు. మండలంలోని నాగిరెడ్డి పల్లె మేజర్ గ్రామపంచాయతీ ఆరవపల్లె లోని నందలూరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో విజేతలకు అందజేసే క్రికెట్ ట్రోఫీలను చమర్తి జగన్మోహన్‌రాజు ఆవిష్కరించారు. ఆపై మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సందర్శించి, క్రికెట్ వీక్షించారు. ఉదయం జరిగిన నీలిపల్లె వర్సెస్ నారాయణరాజుపేట మ్యాచ్‌లో విజేతగా నిలిచిన నీలిపల్లె జట్టు బ్యాట్స్మెన్ హరికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సమ్మెట శివ ప్రసాద్, ఒంటిమిట్ట మాజీ కల్లుగీత కార్మిక రాష్ట్ర డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య, టిడిపి నాయకులు కుర్రా మనీ యాదవ్, చామంచి పెంచలయ్య, వెంకటయ్య, ఖలీద్, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, ఒంటిమిట్ట వినోద్ రెడ్డి, సూర్యనారాయణ రాజు, సురేష్, కొండిశెట్టి సుదర్శన్ క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్లు పల్లె గిష్మంత్ రెడ్డి, మాడపూరి శ్రీరాములు, తోట శివశంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై మండల వ్యవసాయ శాఖాధికారి చంద్రశేఖర్, ఉద్యానవన శాఖాధికారి ఈశ్వరప్రసాద్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం నిమ్మనపల్లి రైతుభరోసా కేంద్రంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతుభరోసా కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ పథకంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకం ద్వారా రైతులు పంటలను సాగు చేయటానికి సకాలంలో నగదును క్రమం తప్పకుండా అందిస్తోందని అన్నారు. రైతులు ఇకెవైసి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. రైతులు సాగుచేసే ప్రతి పంటను ఇక్రాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇక్రాప్‌లో పంటలు నమోదు చేయడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటనష్టం వాటిల్లితే ప్రభుత్వం పంటనష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవడం జరుగుతుందని వివరించారు. ఆర్‌బికె కేంద్రాల నందు రైతులకు ఎరువులను అందిస్తున్నామని అన్నారు. టమోటా ప్రాసెసింగ్ రకంను ప్రోత్సహించడంలో భాగంగా ఒక్క మొలకను 20 పైసలకే ఇస్తున్నట్లు తెలిపారు. దానిమ్మ, జామ, బొప్పాయి, ఉసిరి వంటి పండ్ల తోటలకు ఇస్తున్న రాయితీని వివరించారు. ఎస్‌సి, ఎస్‌టిలకు మల్చింగ్ షీట్‌ను సబ్సిడీపై ఇస్తున్నట్లు తెలిపారు. డ్రిప్, స్ప్రింకర్లు సబ్సిడీపై రైతులకు అందిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ సహాయకులు శ్రీకాంత్, కుమార్ నాయక్, విజయ్ కుమార్‌రెడ్డి, శరత్ కుమార్ రెడ్డి, రెడ్డి భాస్కర, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న వైసిపి


ప్రజాశక్తి-నందలూరు

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని వైసిపి ప్రభుత్వం ఖూనీ చేస్తోందని టిడిపి ఎస్‌సి సెల్ నియోజకవర్గం అధ్యక్షులు జ్యోతిశివ అన్నారు. బుధవారం టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎమ్మెస్‌రాజును అరెస్టు చేయడం అప్రజాస్వామ్యం అన్నారు. చలో కావలి కార్యక్ర మానికి వెళుతున్న ఎంఎస్ రాజును పోలీసులు అర్ధరాత్రి సమయంలో రౌడీల్లా వ్యవహరించి ద్విచక్ర వాహనాలను అడ్డుపెట్టి అరెస్టు చేయడం దారుణం అన్నారు. ప్రశ్నిస్తే పోలీసులు అరెస్టు చేయడం, దళితులు పక్షాన పోరాటాలు చేస్తుంటే ముందస్తు అరెస్టు చేయడం, దళితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వైపిపి ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్‌అహ్మద్ చొరవతో పట్టణంలోని ఒకటవ వార్డు సచివాలయం పరిధిలో బుధవారం విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సచివాలయ పరిధిలోని ప్రజలు మాట్లాడుతూ గతంలో వేసిన వీధిదీపాలు వెలగకపోవడంతో తాము తీవ్రఇబ్బందులు పడేవారమన్నారు.ఈ సమస్యను స్థానిక వైసిపి నాయకుల దృష్టికి తీసుకెళ్లామని, వారు ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డికి సమస్యను తెలియజేశారన్నారు.ఆయన వెంటనే స్పందించి కొత్త విద్యుత్ దీపాలను సత్వరమే వేయించి తమ సమస్యను పరిష్కరించారని తెలిపారు. సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు, పాగొండ ఖలీల్ కు సచివాలయ కన్వీనర్ గుమ్మడికాయల చాంద్‌బాషాకు, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.


ఏర్పాటైన వీధి దీపం

క్రైం కార్నర్

ఆర్‌టిసి బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలో కడప-చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి పంచా యతీ గన్ సీదా వద్ద బుధవారం తెల్లవారుజామున ఆర్‌టిసి బస్సుకు ప్రమాదం తప్పింది. మంచు తీవ్రత అధికంగా ఉండడంతో రహదారిపై మంచుతో కూడిన ముబ్బు పట్టి రోడ్డు కనిపిం చకపోవడంతో ఎదురుగా వస్తున్న లారీని తప్పించ పోయి ప్రక్కనే వున్న కల్వ ర్తును బస్సు ఢీ కొట్టింది. ఈ సంఘ టనలో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. బస్సు ముందు భాగమున పూర్తిగా దెబ్బతింది. ప్రాణా పాయస్థితి నుంచి బయట పడటంతో ప్రయాణికులు ఊపిరి తెలుసుకున్నారు.


ప్రమాదానికి గురైన ఆర్‌టిసి బస్సు

డ్రైవర్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి -కలకడ

ఆర్‌టిసి అద్దె బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పే స్వామి తెలిపారు. మండల కేంద్రమైన కలకడ బస్టాండ్ నందు కలికిరి మండలం అదేవారి పల్లి పంచాయతీ కొత్త పల్లెకు చెందిన శ్రీనివాసులురాజు నడిచి వెళుతుండగా, పీలేరు ఆర్‌టిసి డిపో అద్దెబస్సు ఎపి03టిఇ 6345 నెంబర్ గల బస్సు డ్రైవరు మధు నిర్లక్ష్యంగా, వేగంగా నడిచి వెళుతున్న శ్రీనివాసులు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాసులురాజు ముందుకు బోర్ల పడడంతో ముఖానికి చాతిపై గాయాలు కావడంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం పీలేరు తరలించి, అక్కడనుండి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. శ్రీనివాసులు కొడుకు రవిశంకర్‌రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.